క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఓసిటీ, గాంధీనగర్, క్రిస్టియన్ కాలనీ, ఎస్ఆర్.నగర్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రైల్వే పెన్షనర్ల సమావేశం

కాజీపేట: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కందుల సంఘయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న సమావేశంలో జోనల్ సెక్రటరీ డాక్టర్ పి.యుగంధర్‌తో పాటు రైల్వే ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశాన్ని అసోసియేషన్ సభ్యులు విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఓరియెంటేషన్ ప్రోగ్రాం

వరంగల్: వడుప్సా ఆధ్వర్యంలో వరంగల్ డివిజన్ పరిధిలో పదో తరగతి విద్యార్థులకు ఉర్సుగుట్ట సమీపంలోని నానీ గార్డెన్స్‌లో ఈనెల 18న ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం (అవగాహన సదస్సు) నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య, కార్యదర్శి విలియమ్స్ తెలిపారు. వరంగల్‌లోని స్పందన పబ్లిక్ స్కూల్‌లో వడుప్సా డివిజన్ కమిటీ కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది.

కాజీపేట జంక్షన్‌లో విద్యుత్ వారోత్సవాలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కార్యాలయాల్లో విద్యుత్ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే కార్యాలయాలు, రైల్వే క్వార్టర్స్, వర్క్‌షాప్‌లలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని రైల్వే అధికారులు, కార్మికులకు రైల్వే ఉన్నతాధికారులు సూచించారు.

కాజీపేట జీఆర్పీ ఎస్సైగా నాగరాజు



కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ ఎస్సైగా తోట నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకముందు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మొహినొద్దీన్ వరంగల్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఖిలా వరంగల్: ఫ్యూషన్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వరంగల్ ఉర్సు కరీమాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కంపెనీ డివిజన్ మేనేజర్ వినయ్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, అరుణాల కవిరెడ్డి, హెచ్ఎం నళిని, పూస రామ్, తదితరులు పాల్గొన్నారు.

వెండితెరపై వెలుగొందాలి



హన్మకొండ: వెండితెరపై నబీల్ గొప్పగా వెలుగొందాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆకాంక్షించారు. స్టార్ మా టీవీ నిర్వహించిన బిగ్‌బాస్ షో 8వ సీజన్‌లో టాప్ -3లో నిలిచిన ఓరుగల్లు వడ్డేపల్లి బిడ్డ నబీల్‌ను వినయ్‌భాస్కర్ సోమవారం సన్మానించి అభినందించారు. బిస్‌బాస్ షో ముగించుకొని హనుమకొండకు చేరిన నబీల్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఇమ్మడి లోహిత రాజు, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, కుసుమ లక్ష్మీనారాయణ, జేకే, రఘు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ నిర్మాతలు మీరే



హసన్‌పర్తి: భవిష్యత్ నిర్మాతలు తమరే అని సీడబ్ల్యూసీ సభ్యుడు కణాంపురం దామోదర్ అన్నారు. హసన్‌పర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సంస్కారం వికాసం అనే అంశంపై సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ అధ్యాపకుడు జనార్దన్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యులు మార్క రవీందర్, లక్ష్మీనారాయణ, వలహాల్‌రావు, ఉపాధ్యాయులు హెలెన్, మమత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లరే..అల్లరి!

- వీధుల్లో గుంపులుగా కోతుల సంచారం
- హడలిపోతున్న ప్రజలు



విద్యానగర్ రోడ్లపై సంచరిస్తున్న కోతుల గుంపు



ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్‌లో విద్యానగర్‌తో పాటు పలు కాలనీల్లో కోతుల బెడద అధికమైంది. వీధుల్లో వందలాది కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దాంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి ఆవరణలో చెట్లపై రోజంతా తిష్ట వేస్తున్నాయి. చేతికి అందే పండ్లు తెంపి కుప్పపోస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. తలుపులు తెరిచి ఉంటే ఇంట్లోకి దూరి సామగ్రిని చిందరవందర చేస్తున్నాయని, అందని కాడికి సరులకు ఎత్తుకెళ్తున్నాయని వాపోతున్నారు. చేతిలో కర్ర లేనిది బయటకు వచ్చే పరిస్థితి లేదని పలువురు చెబుతున్నారు. చేతిలో ఏది కనిపించినా లాక్కెళ్తున్నాయని అంటున్నారు. ఎప్పుడు ఏ వీధులో సంచరిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల వానరాల గుంపు అనేక మందిపై దాడి చేయగా చాలామంది ఆస్పత్రి పాలయ్యారు. డివిజన్‌లో కోతుల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈక్రమంలో నగరపాలక సంస్థ తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏజే మిల్లు కార్మిక భవనం కూల్చివేత



కార్మిక భవనాన్ని కూల్చేస్తున్న జేసీబీ

వరంగల్: ఆజంజాహి కార్మికుల సభలు, సమావేశాలకు వేదికైన కార్మిక భవనాన్ని సోమవారం కూల్చివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం ఈభవన స్థలం రిజిస్ట్రేషన్ కావడంతో కార్మిక సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. సోమవారం ఈస్థలంలో కామర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఊరుకోం.. ఉద్యమిస్తాం: బీజేపీ

ఏజే మిల్లు కార్మికులకు చెందాల్సిన కార్మిక సంఘం భవన స్థలం కబ్జా చేశారంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ కార్మికుల సభలు సమావేశాలకు 75 ఏళ్లు ఉపయోగపడిన ఆజంజాహి కార్మిక భవన స్థలం కబ్జాకు గురవడాన్ని ఆయన ఖండించారు. నగరంలో ప్రముఖ బట్టల వ్యాపారవేత్త ఆధ్వర్యంలో నిర్వహించిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కావడాన్ని తప్పుబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కార్మికుల భవనం కబ్జాకు గురి కావడంతో అప్పుడు మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు వారికి అండగా ఉంటానని చెప్పి, ఇప్పుడు కబ్జాలకు పాల్పడ్డ వ్యక్తుల చెంతన చేరి ఏకంగా భవన నిర్మాణానికి భూమి పూజకు రావడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్మిక భవన పరిరక్షణ కోసం బీజేపీ.. కార్మిక సంఘాలను ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తుందని తెలిపారు.

పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి శివారులోని 791, 782, 786, 355, 357, 298 సర్వే నంబర్లలోని ఎస్సారెస్పీకి చెందిన భూముల్లో మూడేళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేసి ఇల్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. ఈమేరకు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణికి సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాత్రి డ్రోజర్ల సహాయంతో కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు బాషుమియా, యాదగిరి, రవీందర్, రవి, రమేష్, సుధీర్, మల్లన్న, శంకర్, హరిబాబు, కుమార్, ప్రసంగి, ప్రవీణ్, పాషా, రవి, మొగిలి పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సునీత, తదితరులు

ఎంజీఎం: ఉద్యోగులకు ఏకీకృత పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌యూ) రాష్ట్ర సమన్వయ కర్త డాక్టర్ కొలిపాక వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 22న నగరంలోని ఇస్లామియా మైదానంలో నిర్వహించనున్న కాకతీయ కదనభేరి సభ వాల్‌పోస్టర్లను నగరంలోని సీకేఎం, టీబీ ఆస్పత్రుల్లో ఆయా ఆస్పత్రుల పర్యవేక్షణాధికారుల సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఉద్యోగులకు సామాజిక భద్రతలేని ఏకీకృత పింఛన్ విధానాన్ని విడనాడాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వచ్చే ఏప్రిల్ 1న నుంచి అమలు చేయబోతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సౌమ్య, డాక్టర్ దీక్షిత్, ఉమారాణి, శ్రావ్య, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగర నడిబొడ్డున వెలిసిన గోవిందాద్రి కొండపై స్వయంభుగా వెలిసిన దేవి భూదేవి నీలాదేవి సతీ, గోవిందరాజస్వామి దేవస్థానం అర్చకులకు న్యాయం చేయాలని ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసాచారి కోరారు. ఆలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30ఏళ్ల నుంచి స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తూ ఆలయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించినట్లు వివరించారు. గత కొన్ని మాసాల నుంచి అనారోగ్యం కారణంగా స్వామివారి సేవలో దూరంగా ఉన్నానని అన్నారు. ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా రావడంతో ఆలయాన్ని కొంతమంది ఆగం చేశారని ఆరోపించారు. ఆలయంలో రాజకీయ జోక్యం మీతిమిరిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీనివాసాచారి ఆరోపణల్లో వాస్తవం లేదు

వరయోగుల శ్రీనివాసచారి, ప్రధాన అర్చకుల ఆరోపణల్లో వాస్తవం లేదని అర్చకుడు వేణుమాధవ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్, ఇతర ప్రజాప్రతినిధులపై దుర్భాషడారని, ఇది తగదని పేర్కొన్నారు. భక్తుల కోసం ఆలయ తలుపులు తెరిస్తే పగులగొట్టారని విమర్శించడం సరికాదని వేణుమాధవ్ అన్నారు.

జాతీయ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాలి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను సన్మానిస్తున్న కార్పొరేటర్ షీబారాణి, ఉపాధ్యాయులు, తదితరులు

దేశాయిపేట: ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లోని ఏంఏ స్టేడియంలో జరగనున్న 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి ఆకాంక్షించారు. ఈమేరకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఆరెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఎస్కే.గుల్షన్, బి.లక్ష్మీప్రసన్నను సోమవారం అభినందించారు. వారికి బుద్దె వెంకన్న రూ.2,500 చొప్పున నగదు పారితోషకం అందిస్తూ, ఆరెపల్లి పాఠశాలకు ఆట వస్తువులు, స్పోర్ట్స్ కిట్లు అందిస్తానని హామీ ఇచ్చారు. దేవగిరిపట్నానికి చెందిన డీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో టీషర్టులు పంపిణీ చేశారు. జిల్లా సాఫ్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పాఠశాల పీఈటీ అశోక్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం వెంకన్న, అసోసియేషన్ కోశాధికారి బి.ముఖర్జీ, ఉపాధ్యాయులు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన జంగ్‌సైరన్ పోస్టర్లను వీసీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, పొగాకు ఉత్పత్తులతో జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ నాయకులు నరేష్, హతిరామ్, అఖిల్, సూర్యకుమార్, రూప్‌సింగ్, ప్రశాంత్, మౌనిక, సంధ్య పాల్గొన్నారు.

భూ పోరాటాలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించే వరకు భూ పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనంలో అంబేద్కర్ నగర శాఖ కమిటీ జన్ను రాజు అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేక నిరుపేదలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, దుండు లక్ష్మణ్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్‌పాల్, అక్బర్ పాషా, సువర్ణ, చిరంజీవి, బాబు, రాజు, కుమార్, ప్రభాకర్, కరుణాకర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

వరంగల్: వరంగల్ జిల్లాలో అర్హులైన కళాకారులందరికీ కల్చరల్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్, ప్రధాన కార్యదర్శి దామెర విజయ్‌కుమార్ (కృష్ణ) కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి ప్రజా కళాకారులుగా సామాజిక రుగ్మతలు, మద్యపాన నిషేధం, వరకట్న దురాచారాలు, నిరక్షరాస్యతపై పలు కార్యక్రమాలు చేపట్టి వేలాది ప్రదర్శనలు ఇస్తూ ప్రజలను చైతన్యవంతులుగా చేసినట్లు వివరించారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో వేలాది వేదికలపై ధూమ్‌ధాంలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కడమంచి చిన్నయాదగిరి, కుంట శాంతి, అముదాల సుమలత, ముత్యాల శ్రీలత, ముద్రబోయిన సాంబయ్య, కడమంచి మహేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కదనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హసన్‌పర్తి: ఈనెల 22న వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కాకతీయ కదనభేరి వాల్‌పోస్టర్లను చింతగట్టు క్యాంపులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 1నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పింఛన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లింగమూర్తి, చంద్రకాంత్, శేషగిరి, రాజమౌళి, అనంతుల శ్రీనివాస్, రమేష్, శంర్, అక్బర్, హమీద్, సరిత, సదానందం, విజయ పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, సాయంత్ర 7 గంటలకు స్వామివారికి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గోవింద నామాలు, శ్రీకృష్ణ అష్టకం, మంత్రపుష్పం, మంగళ శాసనాలు, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేష్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో లక్ష నామార్చనలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రఘురామాచార్యుల ఆధ్వర్యంలో మహిళలతో లక్ష్మీ నారాయణుల లక్ష సహస్రమార్చనలు అర్చకులు చేయించారు. ఆలువేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని బీరన్న గుడి దేవాలయంలో అయ్యప్ప సేవా సమితి కొల్లూరి యోగానంద్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప పడిపూజ, నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. అంతకుముందు వేద పండితులు వెలిదే నరసింహమూర్తి, వెలిదే ప్రదీప్‌శాస్త్రి మంత్రోచ్ఛరణల మధ్య అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక రథంపై అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి రంగశాయిపేట పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, కర్నె రవీందర్, కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, కుంట శ్రీధర్, అడప వేణు, కంచ మల్లయ్య, సుధాకర్, దయాకర్ పాల్గొన్నారు.

అయ్యప్ప నగర సంకీర్తన

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ తొట్ల వాడలో అయ్యప్ప భక్తులు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. గురుస్వామి తొగరు నరేందర్, దేవేందర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మాలధారులు విజయ్, తోట మధు, మహేందర్, బొల్లం సతీష్ పాల్గొన్నారు.

అయ్యప్ప 5వ ఎడిషన్ ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని వేంకటేశ్వర దేవాలయంలో అయ్యప్ప సుమాంజలి ఆధ్వర్యంలో 5వ ఎడిషన్‌ను అధ్యక్షుడు గందె నవీన్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్ గందె కల్పన, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసచార్యులు, ఈఓ రత్నాకర్ రెడ్డి, సముద్రాల సుదర్శన చార్యులు, గుమ్మడవెల్లి ఆశ్రిత్ శర్మ, పోల మహేష్, బొమ్మల గుడి చైర్మన్ కొమ్మిని రాజేందర్ పాల్గొన్నారు.

పూల రవీందర్‌ను గెలిపించండి

విద్యారణ్యపురి: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌ను గెలిపించాలని కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి కోరారు. ఈమేరకు పూల రవీందర్‌తో కలిసి హనుమకొండలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు.

కబ్రస్థాన్‌లో శ్రమదానం

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని జెమిని టాకీస్ వద్ద ఉన్న ముస్లిం కబ్రస్థాన్‌లో పలువురు యువకులు సోమవారం శ్రమదానం చేశారు. సమాజ సేవకుడు మహ్మద్ అబ్దుల్ ఖార్ ఆధ్వర్యంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ నసీర్, అబ్దుల్ సత్తార్, అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ ముబీన్, మహ్మద్ తోసీఫ్, మహ్మద్ అసద్, గౌస్‌పాషా, రఫిక్, జకారియా, జీషాన్, హఫీజ్, వకార్ పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

మడికొండ: ఔటర్ రింగ్ రోడ్డు టేకులగూడెం వద్ద డివైడర్‌లోని మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్రాక్టర్‌ను హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దాంతో మున్సిపల్ ఉద్యోగితో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రామన్నపేట: నగరంలోని 11వ డివిజన్ రాజీవ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుల్ల పద్మావతితో కలిసి వైద్య శిబిరాన్ని విజయలక్ష్మి ప్రారంభించారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: రైలుకింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన వల్లెపు భీమరాజు (33) భార్యతో కలిసి బతుకుదెరువు కోసం వరంగల్ కొత్తవాడకు వలసొచ్చారు. సోమవారం వరంగల్ - కాజీపేట స్టేషన్ల మధ్య శాయంపేట రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని రైలుకింద పడి భీమరాజు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వెంకట్రామ థియేటర్ సమీపంలో వ్యాపారి ఓంన మశ్శివాయ కొత్తగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సోమవారం భూమిపూజ చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ గౌరవ వేతనం, కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నడిగొండ రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి విద్యార్థులకు వంట చేసి పెడుతుండడం కార్మికుల అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.సమ్మక్క, సరిత, జి.శాంత, పర్వీన్, కవిత, ప్రేమలత, సంధ్య, లక్ష్మి, జి.సక్కుబాయి, రాధ, శ్రీలత, కొమురమ్మ, రేణుక, మంజుల, కవిత, కార్మికులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం



వరంగల్: ర్యాలీగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు



హనుమకొండ కలెక్టరేట్‌కు వెళ్తున్న నాయకులు

- ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రమేష్

వరంగల్: ప్రజలందరికీ చెందాల్సిన దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతూ, కష్టజీవుల హక్కులను కాలరాసే విధానాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఏకశిల పార్కు నుంచి వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ, ఎంసీపీఐ(యూ)నాయకులు జగదీశ్వర్, మసూక్, రవి, బాబురావు, ఇస్మాయిల్, నాగేష్, నర్సయ్య, రవి, రామచందర్, రాజు, గోవర్ధన రాజు, జమున, రాకేష్, మల్లయ్య, జయ, రజిత, అశోక్, సుధీర్‌తో పాటు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి.హంసరెడ్డి సూచించారు. భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య), అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం, రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హంసారెడ్డి, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నీల రవీందర్, కర్ర రాజిరెడ్డి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు భద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లాను సమగ్రాభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ - హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని, ఐటీ కంపెనీలు, పరిశ్రమలను అభివృద్ధి చేయాలని చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని త్వరితగతిన పూర్తిచేసి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని, చేపల ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని నెలకొల్పాలని వంటి 17 అంశాలను మహాసభలో తీర్మానాలను చేసినట్లు ఆయన వివరించారు. అలాగే నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గం

జిల్లా కార్యదర్శిగా గాదె ప్రభాకర్‌రెడ్డి, రాగుల రమేష్, ఎం.చుక్కయ్య, బి.చక్రపాణి, జి.వెంకట్, వి.వీరన్న, జి.రాములు, డి.తిరుపతి, దీప, లింగయ్య, డి.భానునాయక్‌తో కూడిన 11 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భారీ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

మడికొండ: నగరంలో భారీ పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. రాంపూర్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరంగా వరంగల్ మహానగరం అభివృద్ధి చెందుతోందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోతు శంకర్‌నాయక్, నాయకులు బొట్టు భిక్షపతి, మంద సుమన్, పద్మ, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.